క్లుప్తంగా

డాక్టరేట్ ప్రదానం


మాధవరావుకు డాక్టరేట్‌ను అందజేస్తున్న వర్సిటీ అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయం రీసెర్చ్ స్కాలర్ పి.మాధవరావుకు క్షయ వ్యాధిపై పరిశోధనకు డాక్టరేట్‌ను సోమవారం ప్రదానం చేశారు. డాక్టరేట్‌ను వీసీ కె.ఆర్.రజిని, రిజిస్ట్రార్ పి.సుజాత అందించారు. రిజిస్ట్రార్ సుజాత, ఏయూ ప్రొఫెసర్ ధనుంజయరావు గైడ్‌గా పీహెచ్‌డీ చేశారు. బయోటెక్నాలజీలో కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. క్షయ వ్యాధికి గల కారణాలు, అందుతున్న చికిత్స, ప్రస్తుత పరిస్థితిని వివరించారు.

క్రీడాకారుడికి సన్మానం


సతీష్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు

రణస్థలం: ఆంధ్ర రాష్ట్ర జూనియర్ వాలీబాల్ జట్టుకి ఎంపికైన కొవ్వాడ హైస్కూల్ విద్యార్థి మైలపల్లి సతీష్‌కు ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు సోమవారం సన్మానించి ఆర్థిక ప్రోత్సాహం అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం టి.పద్మావతి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. పీఈటీ గోవింద అప్పన్న, కొవ్వాడ మాజీ సర్పంచ్ మైలపల్లి పోలీసు, గ్రామ పెద్దలు పి.రాముడు, అప్పలరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రూ.15 లక్షల అందజేత


చెక్కు అందజేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే


ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలం జరజాం పంచాయతీ గొలివివానిపేట గ్రామానికి చెందిన గొలివి గణేశ్వరరావు క్యాన్సర్ బాధపడతున్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.15 లక్షలు మంజూరయ్యాయి. ఈ చెక్కును విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు సోమవారం అందజేశారు. నాయకులు దుంగ దాలినాయుడు, పప్పల వెంకటరమణ పాల్గొన్నారు.

భమిడిపాటికి ప్రశంసలు


భమిడిపాటిని సత్కరిస్తున్న విశ్వవిద్యాలయం ప్రతినిధులు

శ్రీకాకుళం కల్చరల్: రాజమండ్రి ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయంలో గత నెల 28, 29 తేదీలలో నిర్వహించిన తెలుగు జాతీయ సదస్సులో విశ్లేషకునిగా సేవలందించిన భమిడిపాటి గౌరీశంకర్ ప్రశంసలు అందుకున్నారు. విశ్వవిద్యాలయం కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జ్యోతిర్మయి, టి.సత్యన్నారాయణ, కాశీ విశ్వవిద్యాలయం ఆచార్యులు నల్లనయ్యలు గౌరీశంకర్‌ను ఘనంగా సత్కరించారు. ఈయన గాయత్రీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాలలో తెలుగు విభాగాధిపతిగా పనిచేస్తున్నారు. ఈయనను గురజాడ విద్యాసంస్థల అధినేత జి.వి.స్వామినాయుడు, ప్రిన్సిపాల్ డాక్టర్ పులంఖడం శ్రీనివాసరావు, కె.మార్తాండ కృష్ణ, కె.వి.వి.సత్యన్నారాయణలు అభినందించారు.

లబ్ధిదారులకు పూర్తి హక్కులు


పాత్రునివలసలో భూ పత్రాలను పరిశీలిస్తున్న అధికారులు

శ్రీకాకుళం రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పేదలు ఇచ్చిన భూములకు సంబంధించి పూర్తి హక్కులు వచ్చాయని తహసీల్దార్ గణపతిరావు సోమవారం తెలిపారు. 2003 సంవత్సరానికి ముందు పాత్రునివలస, కరజాడ, బైరివానిపేట గ్రామాలకు చెందిన ఆరుగురికి ఏడు ఎకరాల 31 సెంట్లు అప్పట్లో ప్రభుత్వం మంజూరు చేసింది. ఇటీవల రీ సర్వే నిమిత్తం కొంతభూమి ప్రభుత్వ అవసరాలకు తీసుకోగా మిగిలిన భూమి ఆయా లబ్ధిదారుల చేతుల్లోనే వ్యవసాయ సాగులోనే ఉంది. ఇటీవల ప్రభుత్వం ఇచ్చిన జీవోతో 2003 భూమి గల హక్కుదారులకు పూర్తి హక్కులు వచ్చాయన్నారు. దీంతో ఆభూమిని అమ్ముకోవచ్చునన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల సీజ్

రణస్థలం: మండలంలోని పైడిభీమవరం సరిహద్దులో గల కందివలస గెడ్డలో అక్రమంగా ఇసుక లోడ్ చేసి తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను జే.ఆర్.పురం పోలీసులు సోమవారం పట్టుకున్నారు. ట్రాక్టర్లు విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలంలోని గోవిందపురం గ్రామానికి చెందినవిగా గుర్తించారు. ట్రాక్టర్ డ్రైవర్లపై కేసు నమోదు చేశామని జే.ఆర్.పురం ఎస్‌ఐ చిరంజీవి తెలిపారు. ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు చెప్పారు.

మహాలింగార్చన



అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో మాసశివరాత్రి సందర్భంగా సోమవారం ఉదయం అనివెట్టి మండపంలో మహాలింగార్చన కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో మహాపర్వం శివ పంచాయతన సహిత మహాలింగార్చనను అర్చకులు ఇప్పిలి సాందీప్ చేపట్టారు.

-అరసవల్లి

కానుకల లెక్కింపు

శ్రీకాకుళం పట్టణంలోని పాత బ్రిడ్జి రోడ్డులో ఉన్న కనకదుర్గ అమ్మవారి దేవాలయం హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకల ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. 1,76,913 రూపాయలు వచ్చినట్లు ఆలయ ఈవో శ్యామలరావు తెలిపారు. 188 రోజులకు ఈ ఆదాయం సమకూరిందన్నారు. లెక్కింపులో దేవదాయశాఖ తరపున ఈవో, ఆలయ ధర్మకర్త, అర్చకులు పాల్గొన్నారు.

-శ్రీకాకుళం కల్చరల్



సత్కారం

అరసవల్లి ఆలయ ఈవోగా బాధ్యతలు స్వీకరించిన వై.భద్రాజీని వైఎస్సార్‌సీపీనేత, ఆలయ పాలక మండలి సభ్యుడు మండవిల్లి రవి సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన ఆలయంలో గత ప్రభుత్వ హయాంలో పాలక మండలి తీసుకున్న నిర్ణయాల అమలు, అభివృద్ధి తదితర విషయాలను ఈవో భద్రాజీకి వివరించారు. ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఉన్నారు.

-అరసవల్లి



నవజీవన్ ఆశ్రమాన్ని మూసివేయాలి

- జిల్లా అధికారులు

గార: అనుమతుల్లేకుండా, కనీస వసతులు కల్పించకుండా చట్టవిరుద్ధంగా నడుస్తున్న నవజీవన్ నిరాశ్రయుల ఆశ్రమాన్ని మూసివేయాలని బాలల సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ యు.శ్రీలక్ష్మి, జిల్లా పర్యవేక్షణాధికారి బి.వి.రవికుమార్ స్పష్టం చేశారు. మండలంలోని శ్రీకూర్మం తిరుమల తిరుపతి దేవస్థానములోని పాడుబడిన సత్రం ఎదురుగా నిర్వహిస్తున్న నవజీవన్ ఆశ్రమాన్ని సోమవారం కమిటీ సభ్యులతో కలిసి పరిశీలించి, బాలికల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. గతంలో జరిపిన పరిశీలనలో ఈ ఆశ్రమానికి ఎటువంటి అనుమతులు లేవని, 2018లో ఆరునెలల పాటు తాత్కాలిక అనుమతులు పొందడం, తర్వాత ప్రైవేటు హాస్టల్‌గా నిర్వహిస్తుండటాన్ని కమిటీ గుర్తించింది. అంతేకాక రేకుల షెడ్‌లో నిర్వహించడం, మరుగుదొడ్ల నిర్వహణ సరిగ్గా లేకపోవడం, బయట నుంచి ఆహారాన్ని అనుమతిస్తుండటం వంటివి గుర్తించిన కమిటీ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో విద్యార్థినులను సమీప హాస్టల్లో చేర్పించాలని, తల్లిదండ్రులకు అప్పగించాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశాలిచ్చారు. సోమవారం బాలల సంరక్షణ కమిటీ తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించగా స్థానిక గ్రామాల నుంచి చేర్చుకోవాల్సి ఉండగా, దూర ప్రాంతాలైన ఒడిశా, టెక్కలి, సోంపేట వంటి ప్రాంతాల నుంచి విద్యార్థినులను చేర్పించుకోవడాన్ని గుర్తించారు. ఆశ్రమంలో ఒక తండ్రి, ఒక తల్లి ఉన్న బాలికలు 52 మందిలో 39 మందిని శ్రీకూర్మం చుట్టుపక్క గ్రామాలున్న వారిగా గుర్తించారు. దూర ప్రాంతాలకు చెందిన 13 మందిని వారి తల్లిదండ్రులతో పంపించేశారు. ఒక బాలిక తిరుపతి ఆశ్రమం నుంచి ఇక్కడికి తీసుకువచ్చినట్టు గుర్తించి జిల్లా బాలల సంరక్షణ కమిటీ ముందు ఉంచి బాల సదన్‌లో ఉంచేందుకు ప్రాథమికంగా నిర్ధారించారు. స్థానిక బాలికల తల్లిదండ్రులు మధ్యలోనే మూసివేయడం వలన చదువుకు ఇబ్బంది వస్తుందని, విద్యాసంవత్సరం చివరి వరకు నిర్వహించాలని కోరారు.. నిర్వాహకులు 20 రోజుల్లో వసతులు కల్పిస్తామని కమిటీకి తెలిపి, అవసరమైన అనుమతులు తీసుకుంటామన్నారు. ఈ పరిశీలనలో కమిటీ సభ్యులు యు.రమణమూర్తి, ఎం.గన్నెప్పడు, ఐసీడీఎస్ సీడీపీవో రాధామాధవి, చైల్డ్ ప్రొటక్షన్ అధికారులు ఐ.లక్ష్మునాయుడు, ఎం.మల్లేశ్వరరావు, పి.మల్లేశ్వరరావు ఉన్నారు.


సమావేశమైన బాలల సంరక్షణ కమిటీ సభ్యులు

మోసం చేయడం చంద్రబాబు నైజం

- ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్




జి.సిగడాం: కూటమి ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలల పూర్తయినా పేదల కోసం ఒక్క సంక్షేమ పథకమూ అమలు చేయలేదని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. సోమవారం ముషినివలస గ్రామంలో మాట్లాడారు. తిరుపతి లడ్డూ ప్రసాదంపై లేనిపోని ఆరోపణలు చేసిన చంద్రబాబుకు వేంకటేశ్వర స్వామి తగిన బుద్ధి చెప్పుతాడన్నారు. తిరుపతి ప్రసాదంపై చంద్రబాబు చేసిన ఆరోపణలు చూసి ప్రజలు నవ్వుతున్నారన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు లేనిపోని హామీలు ఇచ్చారన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ పరిపాలన సాగుతోందన్నారు. అమరావతి ముంపునకు చంద్రబాబే కారణమన్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు ధైర్యంగా ఉండి ప్రజాపక్షాన పోరాటాలు చేయాలన్నారు.

ఎవరికి ఏ కష్టం వచ్చినా తాను అందుబాటులో ఉంటాన్నారు. రానున్న రోజుల్లో ప్రజాసమస్యలపై ఇక పోరాటాలు చేయడానికి సిద్ధం కావాలన్నారు. నియోజకవర్గంలో ఇప్పటికే వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేశామన్నారు. గ్రామాల్లో పార్టీ మంచి బలం ఉందన్నారు.

సుప్రీంకోర్టు వ్యాఖ్యలు ఆలోచింపచేశాయి

- వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షులు ఎం.వి.స్వరూప్



శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడారని సీఎం చంద్రబాబు చేసిన దుష్ప్రచారంపై సుప్రీంకోర్టు బెంచ్ సోమవారం చేసిన కొన్ని వ్యాఖ్యలు అందర్నీ ఆలోచింపచేశాయని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఎం.వి.స్వరూప్ అన్నారు. సుప్రీంకోర్టు బెంచ్ వ్యాఖ్యలపై సోమవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. సెప్టెంబర్ 25న ఎఫ్‌ఐఆర్ ఫైల్ చేస్తే 26న సిట్ ఏర్పడితే సీఎం హోదాలో ఉన్న చంద్రబాబు సెప్టెంబర్ 18న లడ్డూలో కల్తీ జరిగినట్లు వ్యాఖ్యానించడంపై తప్పు పట్టిందని తెలిపారు. నిజ నిర్ధారణ చేసుకోకుండా అలా పవిత్రమైన తిరుమల లడ్డూ కోసం కోసం ఓ ముఖ్యమంత్రి హోదాలో ఎలా మాట్లాడారని సుప్రీం కోర్టు ప్రశ్నించిన తీరు చూస్తుంటే సామాన్యులు, మేధావులందరికీ నిజాలు తేటతెల్లమైందని పేర్కొన్నారు. అక్టోబర్ 3న ఉన్న ఫరదర్ హియరింగ్‌లో హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా చంద్రబాబు చేసిన వ్యాఖ్యలపై మంచి తీర్పు వస్తుందని ప్రజలంతా ఆశాభావంతో ఎదురు చూస్తున్నారన్నారు. ప్రజలకిచ్చిన సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయడం చేతకాక ప్రజల దృష్టిని మళ్లించడానికి లడ్డూ కల్తీని తెరపైకి తీసుకొచ్చి రాష్ట్ర ప్రజల మనోభావాలు దెబ్బతీయడం సీఎం హోదాలో సరికాదని మండిపడ్డారు.

క్యాన్సర్‌పై అవగాహన

- మంచి అలవాట్లతో ఆరోగ్యం పదిలం

శ్రీకాకుళం అర్బన్: మంచి అలవాట్లతో ఆరోగ్యాని పదిలం చేసుకోవాలని లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షులు డాక్ట బొడ్డేపల్లి సురేష్ అన్నారు. నగరంలోని అక్షర పాఠశాలలో బాల్య క్యాన్సర్‌పై అవగాహన సోమవారం అవగాహన కల్పించారు. పెద్దల శరీరంలో క్యాన్సర్ లక్షణాలను గమనించవచ్చని, పెద్దవారితో పోలిస్తే పిల్లల్లో క్యాన్సర్‌ను గుర్తించడం చాలా కష్టమన్నారు. పిల్లలకు నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ కార్యదర్శి, ప్రముఖ వైద్యురాలు డాక్టర్ పైడి సింధూర, పాఠశాల డైరెక్టర్ బొంది పవన్‌కుమార్, లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ డీసీ బాడాన దేవభూషణరావు, సభ్యులు టెక్కం రామ్‌గోపాల్, శిల్లా మణి తదితరులు పాల్గొన్నారు.


ప్రశంసాపత్రాల్లో విద్యార్థులు

స్వచ్ఛతే లక్ష్యం

ఎచ్చెర్ల క్యాంపస్: జాతీయ సేవా పథకం వలంటీర్లు క్యాంపస్‌లో స్వచ్ఛత లక్ష్యంగా ముందుకు సాగాలని జిల్లా జాతీయ సేవా పథకం కో ఆర్డినేటర్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.అనురాధ అన్నారు. కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగం సెమినార్ హాల్లో సోమవారం జాతీయ సేవా పథకం వలంటీర్లు, పీఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రధానంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు, ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలన్నారు. విద్యార్థుల్లో సేవాదృక్పథం అవసరమన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న స్వచ్ఛతా హీ కార్యక్రమం విజయవంతం చేయటం, భాగస్వాములు కావటం వంటి వాటికి ముందుకు రావాలన్నారు. పచ్చదనం – పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణలకు ప్రాధాన్యత ఇవ్వాలని వివరించారు. గాయత్రీ కాలేజ్ ఆఫ్ మేనేజ్‌మెంట్ హెచ్ఓడీ వి.మహేష్, కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ కోఆర్డినేటర్ నీలం సంతోష్ రంగనాథ్, ఎన్ఎస్ఎస్ యూనిట్ -1 పీఓ కె.కరుణానిధి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అనురాధ

రౌడీషీటర్లపై ప్రత్యేక దృష్టి

- ఎస్పీ మహేశ్వరరెడ్డి



శ్రీకాకుళం క్రైమ్: ఇటీవల నగరంలోని కొన్ని ప్రాంతాల్లో జరుగుతున్న అలజడుల్లో పాత రౌడీషీటర్లు, కొత్తగా పుట్టుకొస్తున్న రౌడీషీటర్ల పాత్రపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. క్రైమ్ హాట్ స్పాట్స్‌పై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. మఫ్టీలో ఉన్న పోలీసులతో నిఘా సర్వైలెన్స్ పెట్టించామని చెప్పారు. ఎవరైనా తమ దృష్టిలోకి వస్తే ముందుగా బైండోవర్.. ఆ తరువాత షీట్లు తెరుస్తామని హెచ్చరించారు.

జాబ్‌మేళాలో 28 మంది ఎంపిక


నియామక పత్రాలతో అభ్యర్థులు


శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల జేకేసీ, నోడల్ రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో కమిషనరేట్ ఆఫ్ కాలేజీ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు నిర్వహించిన జాబ్‌మేళాలో 28 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. ప్రతినెల జాబ్ మేళా నిర్వహించే కార్యక్రమంలో భాగంగా సోమవారం కళాశాలలో హెట్రో ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో ఉద్యోగాల భర్తీకి నిర్వహించిన జాబ్ మేళాకు మంచి స్పందన లభించింది. ఈ జాబ్‌మేళాలో జిల్లాలోని అనేక ప్రాంతాల నుంచి 118 మంది హాజరుకాగా వీరిలో వివిధ పరీక్షల అనంతరం 28 మంది ఆ సంస్థ ప్రతినిధులు ఎంపిక చేశారని ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ తెలిపారు. వీరికి నియామక పత్రాలు అందజేశారు. జేకేసీ కో ఆర్డినేటర్ వై.మణికుమార్, హెట్రో సంస్థ హెచ్‌ఆర్స్ జి.రాజు, సీహెచ్ మణికంఠ, జేకేసీ మెంటార్ రాకేష్ పాల్గొన్నారు.

సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా భానోజీనాయుడు


భానోజీనాయుడు

రణస్థలం: స్థానిక సర్పంచ్ పిన్నింటి వెంకట భానోజీనాయుడుని శ్రీకాకుళం జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడిగా నియమించినట్లు ఆయన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారన్నారు. పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

అంధకారం తొలగింది



శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నగరంలోని పలు కూడళ్లలో వీధి దీపాలు వెలగక ప్రజలు ఇబ్బందిపడేవారు. ఈ సమస్యపై అంధకారంలో శ్రీకాకుళం వీధులు శీర్షికన గత నెల 23వ తేదీన సాక్షిలో కథనం వచ్చింది. దీనికి నగరపాలకసంస్థ అధికారులు స్పందించారు. కిమ్స్‌రోడ్డులో, నగరంలో అనేక వీధుల్లో వీధి దీపాలను ఏర్పాటు చేయడంతో సమస్య పరిష్కారమైంది.

కిమ్స్ రోడ్డులో వెలిగిన లైట్లు

వెలుగుల సిరి.. వెలిగింది



విద్యుత్ కాంతుల్లో వెలుగుల సిరి బోర్డు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం నగరానికి వచ్చే సింహద్వారం వద్ద 'అదిగో ఆదిత్యపురి..శ్రీకాకుళం వెలుగుల సిరి' అనే విద్యుత్‌కాంతుల బోర్డును అధికారులు ఏర్పాటు చేశారు. దీనికి వేసిన లైట్లు వెలగడం లేదని 'సాక్షి'లో సెప్టెంబర్ 23వ తేదీన వెలుగుల సిరి..వెలగదా మరి శీర్షికన వార్తను ప్రచురించింది. దీనికి కార్పొరేషన్ అధికారులు స్పందించి మరమ్మతులు చేశారు.

విద్యార్థి దశ మరువలేనిది


విద్యార్థినుల నృత్యప్రదర్శన


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రతి ఒక్కరి జీవితంలో విద్యార్థి దశ ఎంతో మధురమైనది, మరువలేనిదని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. సోమవారం శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఫస్టియర్ విద్యార్థినులకు ఆహ్వానం పలుకుతూ సీనియర్ విద్యార్థినులు ఫ్రెషర్స్‌డే వేడుకలను నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. డీమ్డ్ యూనివర్సిటీ స్థాయికి మహిళా కళాశాల చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కింతలి సూర్యచంద్రరావు, జీఎస్టీ అధికారి గొలివి రాణీమోహన్ పాల్గొన్నారు.

ఉపాధి సిబ్బందిపై విచారణ


దర్యాప్తు నిర్వహిస్తున్న ఎంపీడీఓ నిశ్చల

జి.సిగడాం: మండలంలోని పాలఖండ్యాం గ్రామంలో సర్పంచ్ అనుమతి లేకుండా పలు పనులు చేపట్టారని, ఇటీవల జిల్లా కలెక్టర్‌కు గ్రామ సర్పంచ్ ధారబోయిన రెయిమ్మ, , దారబోయిన ధర్మారాజ్ కలిసి ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం ఎంపీడీఓ కె.నిశ్చల, పీఆర్ఏఈఈ శ్రీవల్లి కలిసి విచారణ చేపట్టారు. సర్పంచ్ ఇచ్చిన నివేదికను జిల్లా ఉన్నత అధికారుల దృష్టికి తీసుకువెళ్తామన్నారు. ఈఓపీఆర్డీ ఎస్.శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ పలిశెట్టి సూర్యనారాయణ, ఏపీఓ చోళ్ల సత్యనారాయణ, ఈసీ గేదెల పురుషోత్తమరావు, పంచాయతీ కార్యదర్శి రాజా రమేష్, టీఏలు వైకుంఠరావు, రమణ, సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులకు అభినందన


విద్యార్థులతో అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్‌జీయూకేటీ) విద్యార్థులు 20 మంది మినిస్ట్రీ ఆఫ్ యూత్ సర్వీసెస్ జిల్లా స్థాయి ఫెస్టివల్‌లో పాల్గొన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం నిర్వహించి పోటీల్లో మెరుగైన ప్రదర్శన కనబరిచారు. వీరికి నిర్వాహకులు బహుమతులు, ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. రాష్ట్ర స్థాయికి మెరుగైన ప్రదర్శన ఆధారంగా ఎంపిక చేశారు. విద్యార్థులను డైరెక్టర్ కొక్కిరాల వెంకట గోపాల ధనబాలాజీ, పరిపాలన అధికారి ముని రామకృష్ణ, అకడమిక్ డీన్ కొర్ల మోహన్ కృష్ణ చౌదరి తదితరులు సోమవారం అభినందించారు.

ధ్యానంతో ఆరోగ్యం

శ్రీకాకుళం కల్చరల్: ధ్యానంతో శారీరక ఆరోగ్యంతో పాటుగా మానసిక ప్రశాంతత లభిస్తుందని స్పిరిట్యువల్ సొసైటీ అధినేత ఎస్.ఆర్.మూర్తి అన్నారు. స్థానిక ఇందిరావిజ్ఞాన్ భవన్‌లో స్పిరిట్యువల్ లైఫ్ సొసైటీ ఏ మిషన్ ఆఫ్ శ్రీరామచంద్ర ఆధ్వర్యంలో ఉచిత ధ్యాన శిక్షణ ఆదివారం జరిగింది. బి.దానయ్య, సీహెచ్ బాలకృష్ణ, టి.కృష్ణమూర్తి, కె.తవిటయ్య పాల్గొన్నారు.

పరామర్శ..


సూర్యనారాయణ కుటుంబాన్ని పరామర్శిస్తున్న గొర్లె కిరణ్‌కుమార్

జి.సిగడాం: మండలంలోని సర్వేశ్వరపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గుణపూరు సూర్యనారాయణ తండ్రి ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ సోమవారం ఆ కుటుంబాన్ని పరామర్శించారు. పరామర్శించిన వారిలో సర్వేశ్వరపురం సర్పంచ్ చందక సతీస్, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, డోల వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ నాయకులు చందక మహేష్, చందక కూర్మారావు, చందక ఈశ్వరరావు, అలబోయిన సత్యనారాయణ, యడ్ల భాస్కరరావు ఉన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం: స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో జరిగిన వివిధ క్రీడా పోటీల్లో శ్రీకాకుళం నగరంలోని ఏవీఎస్ఎమ్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చడం ద్వారా రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికై య్యారని ప్రధానోపాధ్యాయురాలు ఇందిరామణి తెలిపారు. జి.జీవన్ ప్రియ, టి.ఝాన్సీ, టి.సునీత, ఎ.రామచంద్రమూర్తి, పి.కీర్తనతో పాటు హకీ టీం కూడా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైయ్యారు. వీరిని సోమవారం పాఠశాలలో ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు అభినందించారు.

అంచనాలు రూపొందించాలి

ఎచ్చెర్ల క్యాంపస్: గ్రామాల్లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ పనుల ప్రతిపాదనలు మేరకు అంచనాలు రూపొందించాలని ఎంపీపీ మొదలవలస చిరంజీవి అన్నారు. ఎచ్చెర్ల మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం గ్రామ సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు వంటి వాటికి అంచనాలు రూపొందించాలన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ రామ్మోహన్, సీనియర్ అసిస్టెంట్ కిల్లారి నారాయణరావు పాల్గొన్నారు.